క్లుప్తంగా

గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే



స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఎన్‌టీఆర్ నగర్‌లో పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

పెద్దాపురం: స్వచ్ఛ భారత్‌కు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర కోరారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్, క్లీన్ ఇండియాలో భాగంగా శుక్రవారం ఎన్‌టీఆర్ నగర్‌లో ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సరేంద్ర మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఎన్‌టిఆర్ నగర్‌లో పారిశుధ్య కార్మికులు చెత్త ఏరివేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచారు. గుర్రాల యాకోబు, తలారీ ధరేంద్రం, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

బాడీబిల్డర్ సురేష్‌బాబుకు సత్కారం



సురేష్‌బాబును సత్కరిస్తున్న క్రీడాకారులు

పిఠాపురం: గోవాలో ఇటీవల జరిగిన ఐఎన్‌సీ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తాచాటిన పిఠాపురానికి చెందిన కేతిసీడి సురేష్‌బాబును శుక్రవారం క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. సురేష్‌బాబు బాడీ బిల్డింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనపరిచి సీనియర్ మెన్స్ ఫిజిక్ విభాగంలో బంగారు పతకం, మెన్స్ ఫిజిక్ ఓవరాల్ విభాగంలో, మెన్స్ క్లాసిక్ ఫిజిక్, ఓపెన్ కేటగిరి ఓవరాల్ విభాగాల్లో బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. కాగా శుక్రవారం స్వగ్రామం వచ్చిన సురేష్‌బాబును తోటి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు శాలువా, పూల మాలలతో సత్కరించారు.

వృత్తి విద్య తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కమలం

పెద్దాపురం: విద్యతో పాటు విద్యార్థులకు నవోదయ విద్యాలయలో అందిస్తున్న వృత్తి విద్యా కోర్సుల శిక్షణ తగరతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో పది రోజుల పాటు నిర్వహించే ఈ తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పిల్లలు విద్యతో పాటు వివిధ వృత్తులపై అవగాహన కల్పించుకోవాలన్నారు. విద్యార్థులకు చెక్క బొమ్మల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వి.రామలత, వీరాస్వామి, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



ఎంఆర్‌సీ భవనం వద్ద ఐక్యత నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

పెద్దాపురం: కాంట్రాక్టు ఉద్యోగులు ఐక్యతతో సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని సమగ్ర శిక్ష ఉద్యోగుల గౌరవాధ్యక్షుడు జి.ప్రకాశరావు అన్నారు. మండలంలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకుని, ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఐక్యత నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులుగా ప్రకాశరావు, అధ్యక్షుడిగా పి.కళ్యాణ్, ఉపాధ్యక్షురాలిగా ఎం.లావణ్య, కోశాధికారిగా వి.సువర్ణరత్నం, కన్వీనర్‌గా డి.మూర్తి, కో కన్వీనర్‌గా తరుణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలిగా పావనిలను ఎన్నుకున్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

పెద్దాపురం: కనీస వేతనాలు అమలు చేయాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద స్థానిక ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న నిరసన దీక్ష శుక్రవారం నాలుగో రోజూ కొనసాగించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాయకులు చెక్కల రమణి సీపీఎం నాయకులు మద్దతు పలికారు.

ఏళ్ల కష్టాన్ని మరిపింఛేన్

- గత కాలపు అవస్థలకు చెక్
- పింఛన్ లబ్ధిదారులకు ఊరట
- వలంటీర్ల సేవలపై సర్వత్రా హర్షం



ఉండూరు పంచాయతీ వద్ద పింఛన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)



మంచంపై ఉన్న అక్కవరపు సూర్యకాంతానికి పింఛను అందజేసిన వలంటీర్ శ్యామల

సామర్లకోట: రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీ అందుకోవడంలో గత ప్రభుత్వాల హయాంలో వృద్ధులు ఎదుర్కొన్న ఇబ్బందులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కనిపించకుండాపోయాయి. జిల్లా పరిధిలో 2,80,408 మందికి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లతో పాటు చేనేత, మత్స్యకారుల, ఒంటరి మహిళ, డప్పు కళాకారుల వంటి 17 రకాల పింఛన్లు ఇవ్వనున్నట్టు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. తమకు అర్హత ఉన్నా పింఛను రావడం లేదనే ఆరోపణలకు తావు లేకుండా పోయింది. సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకు రావడంతో స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడింది. దాంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు తెలియజేస్తున్నారు. అర్హత ఉన్న వారికి వర్తించే పథకాలను తెలియజేస్తున్నారు. దాంతో పక్కవారికి కూడా తెలియకుండా అర్హులంతా ప్రభుత్వ పథకాలు అందుకుంటున్నారు. గతంలో పింఛను కోసం ఆయా ప్రాంతాలకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. దివ్యాంగులు, వృద్ధులు ఆటోలు, రిక్షాలలో ఆయా ప్రాంతాలకు వెళ్లి రావడం వల్ల రూ.200 నుంచి రూ.300 వరకు ఖర్చు అయ్యేది.

వలంటీర్ వ్యవస్థతో..

జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛను పెంచుకుంటూ పోతున్నారు. రూ.2000 వేల నుంచి రూ.2,750కి పెంచారు. 2024, జనవరి నుంచి పింఛను రూ.మూడు వేలకు పెరుగుతుం ది. ఈ మొత్తాన్ని వలంటీర్లు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి ఇవ్వనుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్నత స్థితిలో ఉండి ప్రస్తుతం ఆర్థికంగా చితికి పోయిన వారు బయటకు వెళ్లి పింఛను తీసుకొవడానికి ఇబ్బంది పడేవారు. అటువంటి వారంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మూడు నెలలపాటు వరుసగా పింఛను తీసుకోకపోతే పింఛను రద్దయ్యే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని లబ్దిదారులు ఆస్పత్రిలో ఉన్నా బంధువుల ఇళ్ల వద్ద ఉన్న సుదూర ప్రాంతాలకు వెళ్లి పింఛను అందజేస్తున్న సందర్భాలు ప్రతి నెలా జరుగుతున్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



గొల్లప్రోలు ఎంపీడీఓ శర్మకు వినతి ప్రతం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పిఠాపురం: తమకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం గొల్లప్రోలు ఎంపీడీఓ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పనిలో టార్గెట్ విధానాన్ని రద్దు చేయాలని, మూడేళ్లు పూర్తయిన వారికి ఎఫ్‌టీఈ అమలు చేయాలని, పదోన్నతి కల్పించాలని, ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ10 లక్షలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 18 నుంచి కలెక్టర్ కార్యాలయాల ఆందోళన, జనవరి 5న ఛలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కె.నూకరాజు, పి.రాఘవలు, వి.సుబ్రమణ్యం, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ జాతీయ పోటీలకు పీబీ దేవం విద్యార్థి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సునంత్‌బాబు

పెద్దాపురం: బీహార్ రాష్ట్రంలో ఫిబ్రవరిలో నిర్వహించే జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్‌కు తమ విద్యార్థి టి.సునంతబాబు ఎంపికైనట్టు ఆర్బీ పట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.మల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో 9వ తరగతి చదువుతున్న సునంతబాబు హోమర్‌త్రో అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- వేట్లపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్



వేట్లపాలెంలో లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించిన దవులూరి దొరబాబు



కుతుకుడుమిల్లిలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సామర్లకోట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలోని వేట్లపాలెంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని దవులూరి తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పథకాలను అందజేశారన్నారు. వేట్లపాలెంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.109 కోట్లు అందజేసినట్టు ఆయన వివరించారు. ఈ సంక్షేమంతోనే అభివృద్ధి అని నిరూపించిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని, అటువంటి వ్యక్తి జీవితకాలం ఉండాలని ఆయన అన్నారు. పార్టీ పెట్టిన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి కావాలనే పోటీ చేస్తారని, అయితే పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి ఎవరి కోసం తిరుగుతున్నారో ప్రజలే ఆలోచించాలన్నారు. నియోజకరవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థానికుడైన తనకు అవకాశం ఇచ్చారని, తనను గెలిపించాలని ఆయన కోరారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకొవడానికి తాను రాజకీయాలలోనికి వచ్చానని తెలిపారు. ప్రజలకు మంచి చేసిన వారిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని దొరబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో లబ్దిదారుల జాబితా బోర్డును ఆయన ఆవిష్కరించి పార్టీ జెండా ఎగురవేశారు. గ్యాస్ లబ్దిదారులకు గ్యాస్ కనెక్షన్లు పింపిణీ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, సచివాలయాల కన్వీనర్ ఉటా వాసు, హుస్సేన్‌పురం ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు గోలి బాబ్జీ, నాగనబోయిన రాజబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని కుతుకుడుమిల్లిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ కుల, మత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం చేనేత కార్మికులను గుర్తించలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి రూ.24 వేలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ



శ్రీరాంపురంలో తెరిచిన అంగన్‌వాడీ కేంద్రం

కొత్తపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు విధులను బహిష్కరించి ఆందోళనలు చేస్తున్నారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మూసివేసిన అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా నిర్వహిస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం మండల అధికారుల పర్యవేక్షణలో యథావిధిగా నిర్వహించినట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు. నిబంధనల ప్రకారం గర్భిణులు, బాలింతులు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కాకినాడ లీగల్: భూ హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు న్యాయవాదులు నిరసన ర్యాలీ చేపట్టారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముత్తింటి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భూ హక్కు చట్టాన్ని రద్దు వెంటనే చేయాలని కోరారు. న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

అమరజీవి జీవితం అందరికీ ఆదర్శం



శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు



ఆర్డీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆర్డీఓ జేఎస్ రామారావు



శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించిన చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



కొత్తపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పెద్దాపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వక్తలు కొనియాడారు. శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయనకు నివాళులు అర్పించారు.

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మత్యాగం చేసిన విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలోని గోలి వారి వీధి, సినిమా సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, విడదాసరి రాజా, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీఓ జేఎస్ రామారావు, కార్యాలయ సిబ్బంది శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. డీటీ భానుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈఓపీఆర్‌డి మూర్తి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కృషి శ్రీరాములుదే

సామర్లకోట: మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలోని తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాముల వల్లే తెలుగు రాష్ట్రం ఏర్పడిందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆమె ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మేనేజర్ అచ్యుతరాజు, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు నివాళులు అర్పించారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పరిపాలనాధికారి కె.మంగతాయారు, ఉపాధి హామీ ఏపీఓ ఆర్.ప్రభాకరరావు ఇతర సిబ్బంది పాల్గొని శ్రీరాములుకు నివాళులు అర్పించారు.

కొత్తపల్లి: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటనారాయణ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మిక్తిప్రదాతా.. మధుసూదనా..

- నేటి నుంచి ధనుర్మాసం
- కళకళలాడనున్న వైష్ణవ ఆలయాలు
- ఇంటి ముందు ముగ్గులు, గొబ్బెమ్మల సందడి



ధనుర్మాస వేడుకులకు ముస్తాబవుతున్న కాకినాడ దేవాలయం వీధిలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలోని వైష్ణవాలయాలు ధనుర్మాస వేడుకలకు సమాయత్తమయ్యాయి. ఇప్పటికే ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో రంగురంగుల ముగ్గులు వేసి సుందరంగా తయారు చేశారు. నెల రోజులు పాటు ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. దాతల సహకారంతో ఉదయం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసేందుకు దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తిరుప్పావై పఠించేందుకు ఏర్పాట్లు చేశారు. హిందువుల విశ్వాసాల ప్రకారం ధనుర్మాసం మతపరమైన ఆరాధన, తీర్థయాత్రలకు ఎంతో కీలకమైనది. ఈ సమయంలో సూర్యుడు దక్షిణాయణం చివర్లో, ఉత్తరాయణ ప్రారంభంలో ఉంటాడు. ఈ కాలంలో చలితీవ్రత మరింత పెరుగుతుంది. ధను సంక్రాంతి సమయంలో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఈ మాసంలో ఆండాళ్‌పూజ, తిరుప్పావై పఠనం, గోదాదేవి కల్యాణం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేస్తారు.

తిరుప్పావై

తెలుగు పంచాంగం ప్రకారం, మార్గశిర మాసంలో పౌర్ణమి తర్వాత పాడ్యమి నుంచి వైష్ణవులు ధనుర్మాస వ్రతాన్ని ప్రారంభిస్తారు. ఈ మాసం విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరమైనది. ఈ కాలంలో గోదాదేవి మార్గళి వ్రతం చేసి నారాయణుడిని ఆరాధించింది. ధను సంక్రమణ కాలంలో నదీస్నానాలు, పూజలు, జపాలు చేయడం వల్ల శుభ ఫలితాలు వస్తాయని చాలా మంది నమ్ముతారు. ఈ నెలలో బ్రహ్మ ముహూర్తంలో నారాయణ పారాయణ చేసిన వారు దైవానుగ్రహాన్ని పొందుతారని విశ్వాసం. సాక్షాత్తు భూదేవి అవతారమైన ఆండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. ద్రవిడ భాషలో తిరు అంటే పవిత్రం, పావై అంటే వ్రతం అని అర్థం. వేదాలు, ఉపనిషత్తుల సారమే తిరుప్పావై అని హిందూ పురాణాల్లో పేర్కొనబడింది.

ఇంటి ముందు గొబ్బెమ్మలతో

ధనుర్మాసంలో శ్రీవిష్ణుమూర్తిని మధుసూదన పేరిట పూజిస్తారు. ఈ నెలలో తొలి పక్షం రోజులు చక్కెర పొంగలి, పులగం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ కాలంలో పెళ్లి కాని కన్యలు తమ ఇంటి ముగ్గులు, గొబ్బెమ్మలతో పూజించడం వల్ల తమ కోరికలన్నీ నెరవేరుతాయి. ఇంటి ముందు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, వాటిని బియ్యం పిండి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజిస్తారు. ఈ నెలలో గోదాదేవి మార్గళి వ్రతం పేరిట మహావిష్ణువును పూజించి మోక్షం పొందిందని పురాణాల్లో పేర్కొన్నారు. ఈ ధనుర్మాసం వ్రతం వివరాలు బ్రహాండ, ఆదిత్య పురాణాలు, భాగవతం, నారాయణ సంహితాల్లోను కనిపిస్తాయి.

నేటి నుంచి రజిత దశావతార అలంకార ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామ స్వామి ఆలయంలో శనివారం నుంచి 2024 జనవరి 15 వరకూ ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఈఓ వి.శ్రీనివాసరావు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకాలు, మహావిష్ణు అలంకారం, ఉత్తర ద్వార దర్శనం, స్వామి వారికి బేడా ఉత్సవం జరుగుతాయన్నారు. 24న హనుమద్వ్రతం సందర్భంగా ఆలయంలో స్వయంగా వెలసిన ఆంజనేయస్వామి వారికి నాగవల్లీ దళయుక్త గంగ సింధూరం విశేష అర్చన, వడమాల కైంకర్యం, జనవరి 13న గోదా అమ్మవారికి నీరాట్ట ఉత్సవం, 14న గోదాకల్యాణం జరుగుతాయన్నారు. ఈ నెల 23న మహావిష్ణు, 24న మత్స్యావతారం, 25న కూర్మావతారం, 26న వరాహావతారం, 27న నరసింహావతారం, 28న వామనావతారం, 29న పరశురామావతారం, 30న రామావతారం, 31న బలరామావతారం, జనవరి 1న కృష్ణావతారం, 2న బుద్ధావతారం, 3న కల్కి అవతారం, 4న జగన్మోహిని అవతారం, 5న వేంకటేశ్వరస్వామి అవతారం, 6న శేషశయన అవతారం, 7న లక్ష్మీ హయగ్రీవ అవతారం, 8న ధన్వంతరి అవతారం, 9న దత్తాత్రేయ అవతారం, 10న విశ్వరూప సందర్శన అవతారం స్వామి దర్శనమిస్తారన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మొత్తం 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 16 లీటర్ల సారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో ఆరు లీటర్ల సారాతో కడతి శ్రీదేవి, కిర్లంపూడి మండలం రామచంద్రాపురంలో ఐదు లీటర్ల సారాతో గుత్తూరి శివ, సోమవరం గ్రామంలో ఐదు లీటర్ల సారాతో గుత్తుర్తి కృపానందంను అరెస్టు చేశామన్నారు. కిర్లంపూడి మండలం తామరాడలో ఐదు లీటర్ల సారాతో పరారైన కేత కొండమ్మపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.